

భర్త కోసం మౌన పోరాటం

నా భర్త నాకు కావాలంటూ భాగ్యలక్ష్మి అనే మహిళ అత్త ఇంటి ముందు మౌనపోరాటం చేపట్టింది. -8లో..



పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి వైఎస్ జగన్ ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ కొరముట్ల పేర్కొన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.280
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 171 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	600	600
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 108.90 కిలోలు

ప్రమాదాల రహదారి

- కడప- రేణిగుంట రహదారిలో నిత్యం ప్రమాదాలే
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- హైవేలో ప్రయాణమంటేనే భయం
- తాజాగా కుక్కలదొడ్డి వరకు బ్లాక్‌స్పాట్స్ సర్వే
- ప్రమాదాల స్థితిగతులపై నివేదిక కోరిన వైఎస్సార్ జిల్లా కలెక్టర్



కడప-రేణిగుంట హైవే రోడ్డులోని బ్లాక్‌స్పాట్

రాజంపేట: కడప-రేణిగుంట హైవే ప్రస్తుతం బ్లాక్ స్పాట్స్(ప్రమాద స్థలాలు) హైవేగా కొనసాగుతోంది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదం జరుగుతోంది. జాతీయ రహదారంతా రక్తపు మరకలే కనిపిస్తున్నాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. రెండు దశాబ్దాల క్రితం సింగిల్‌రోడ్డుగా ఉన్న రహదారిని వెడల్పు చేసి స్టేట్‌హైవే డబుల్ రోడ్డుగా మార్చారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రస్తుతం జాతీయ రహదారిగా ఈ రోడ్డు కొనసాగుతోంది.

హైవేలో ప్రయాణం.. భయం భయం..

ప్రస్తుతం హైవే వెంబడి ప్రయాణం చేయడమంటే భయం.. భయంగా వెళ్లాల్సి వస్తోంది. ఎటువైపు నుంచి ప్రమాదం పొంచి ఉందో తెలియని పరిస్థితి. కడప శివార్లలో జేఎంజే కళాశాల నుంచి భాకరాపేట సర్కిల్, మాధవరం, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, మంగంపేట, రైల్వేకోడూరు, శెట్టిగుంట, కుక్కలదొడ్డి వరకు హైవేలో రహదారి ప్రయాణం కత్తిమీద సాములా మారింది. మార్గంలో అనేక ప్రమాదకర మలుపులున్నాయి. ఒంటిమిట్ట, నందలూరు, రెడ్డిపల్లె చెరువుకట్టలపై రహదారి ఉంది. అనేకమార్లు చెరువుల్లోకి కూడా వాహనాలు అదుపు తప్పిపడిన సంఘటనలు ఉన్నాయి.

యాత్రికులరోడ్డుగా..

దక్షిణభారతదేశం నుంచి తిరుమలకు కడప-రేణిగుంట మార్గం మీదుగా వేలాదిమంది యాత్రికులు వాహనాల ద్వారా చేరుకుంటున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకతోపాటు రాజస్థాన్, యూపీ తదితర రాష్ట్రాలనుంచి వేలాదిమంది యాత్రికులు ఈ మార్గంలోనే ప్రయాణం కొనసాగిస్తుంటారు. అయితే వీరి వాహనాలు అనేక సార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి.

పెరుగుతున్న ట్రాఫిక్..

కడప-రేణిగుంట హైవేలో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతోంది. ఈ మార్గం మీదుగా తిరుపతి, చెన్నై, ముంబయి, హైదరాబాదు మధ్య రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం 17వేలకు పైగా వాహనాలు హైవేపై పరుగులు తీస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్‌కు హైవే సామర్థ్యం సరిపోవడంలేదు. ఫలితంగా ప్రమాదాలు, ట్రాఫిక్ స్తంభించిపోవడం లాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయి.

ప్రత్యామ్నాయం.. గ్రీన్ ఎక్స్‌ప్రెస్ నేషనల్‌హైవే

పాత హైవేకి ప్రత్యామ్నాయంగా కేంద్రప్రభుత్వం గ్రీన్‌ఎక్స్‌ప్రెస్ నేషనల్ హైవే రోడ్డు(716)ను తీసుకొచ్చింది. రూ.3వేల కోట్ల వ్యయంతో తక్కువ సమయంలో తిరుపతి చేరేలా 133 కిలోమీటర్ల దూరం హైవేను తీసుకొస్తున్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలో రైలుమార్గానికి పడమర వైపు కొనసాగుతోంది. తిరుపతి, చెన్నై నగరాలకు త్వరగా చేరుకునేందుకు హైవే దోహదపడుతుంది. అంతేగాకుండా భారీ వాహనాలు, దక్షిణ భారతదేశాల నుంచి వచ్చే యాత్రికుల వాహనాలు కొత్త నేషనల్ హైవే మీదుగా వెళ్లనున్నాయి. ఫలితంగా కడప-రేణిగుంట పాతరోడ్డులో ట్రాఫిక్ తగ్గిపోయి, ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని అధికారులు అంటున్నారు. కొత్త హైవే నిర్మాణం కోసం ఎదురు చూస్తున్నారు.

కుక్కలదొడ్డి వరకు బ్లాక్‌స్పాట్ సర్వే

కడప-రేణిగుంట నేషనల్ హైవేలోని జిల్లా సరిహద్దు ప్రాంతమైన కుక్కలదొడ్డివరకు బ్లాక్‌స్పాట్స్‌పై సర్వేను అధికారుల బృందం నిర్వహించారు. ఇందులో రాజంపేట ఎంవీఐ వినోద్‌కుమార్,. ఎన్‌హెచ్ డీఈ రామకృష్ణనాయక్, సీఐ పుల్లయ్య ఉన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ఉన్న రోడ్డు పరిస్థితులు తదితర అంశాలపై సర్వే చేపట్టారు. సర్వే నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నారు. ఇటీవల ప్రమాదాలు అధికంగా జరుగుతున్న క్రమంలో కలెక్టర్ హైవేలో రాకపోకల స్థితిగతులపై నివేదిక కోరినట్లు సమాచారం.

ప్రతి చోట బ్లాక్‌స్పాట్స్..

కడప-రేణిగుంట హైవేలో ప్రతి మండల పరిధిలో బ్లాక్‌స్పాట్స్(ప్రమాద స్థలాలు)ను గుర్తించారు. రాజంపేట అర్బన్‌లో 3, నందలూరు 2, , రైల్వేకోడూరు 3, పుల్లంపేట 3 ఓబులవారిపల్లి 6, మన్నూరు 3తో పాటు అలాగే ఒంటిమిట్ట, మాధవరం, భాకరాపేటలో కూడా ప్రమాదానికి దారితీసే ప్రాంతాల్లో నివారణ చర్యలను చేపట్టారు. ప్రత్యేక బృందాలు సర్వే చేసి కడప-రేణిగుంట మార్గంలోని హైవేపై ప్రమాదాలు జరుగుతున్నాయని నిర్ధారణకు వచ్చారు. ఈ క్రమంలో పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట పెద్దాసుపత్రిలో ట్రామా సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశారు.



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో (ఫైల్)

రబీలో ఈ-క్రాపింగ్ వందశాతం నమోదు

- సాధారణ సాగు 1,01,671.8 ఎకరాలకు 74,464.24 ఎకరాలలో పంటల సాగు
- 4258 మంది రైతులకు 41792 మంది రైతులకు ఈకేవైసీ పూర్తి
- ఈనెల 20న రైతు భరోసా కేంద్రాలలో ఈ-క్రాప్ తుది నివేదిక ప్రదర్శన
- జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ



రాయచోటి: అన్నమయ్య జిల్లా పరిధిలో రబీ సీజన్‌లో సాగుచేసిన పంటల వివరాలను ఈ-పంట నమోదు పూర్తి చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లాలో పంటల వివరాలు, ఈ-క్రాపింగ్ నమోదు తదితర అంశాలపై పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. రబీ సీజన్‌లో జిల్లాలో ఒక లక్ష, 1671.8 ఎకరాలలో సాధారణ సాగు కావాల్సి ఉండగా ఈ ఏడాది 74,464.24 ఎకరాలలో వివిధ పంటలు సాగయ్యాయన్నారు. సాగైన పంటలకు ఈ -పంటలో నమోదు వందశాతం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 42581 మంది రైతులు పంటలను సాగు చేయగా 41792 మంది రైతులు అనగా 98.1 శాతం ఈకేవైసీ చేయించారన్నారు. సామాజిక తనిఖీలో భాగంగా ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి క్రాప్ బుకింగ్ డేటాను పూర్తి చేస్తామన్నారు. ఇలా పూర్తి చేసిన డేటాను ఆయా గ్రామాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శిస్తామన్నారు. చివరగా ఈ పంట జాబితాను మార్చి 20వ తేదీన అన్ని రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శింప జేస్తామన్నారు. రబీలో సాగు చేసిన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

న్యూస్‌రీల్

గాలికుంటు టీకాపై అపోహలు వీడాలి



గాలికుంటు వ్యాధి టీకాలపై అవగాహన పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న జేడీ కోటేశ్వరరావు, సిబ్బంది

మదనపల్లె : పశువులకు గాలికుంటు వ్యాధికి టీకా వేయిస్తే పాలు తగ్గిపోతాయనే అపోహలను రైతులు వీడాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్.వి.కోటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక డివిజన్ కార్యాలయంలో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1 నుంచి 31 వరకు మదనపల్లె డివిజన్ పరిధిలోని 12 మండలాల్లో అన్ని పశువులకు ఉచితంగా టీకాలు వేస్తామని తెలిపారు. రైతులు తమకు సమీపంలోని ఆర్‌బీకే, గ్రామీణ పశువైద్యకేంద్రాలు, డిస్పెన్సరీలలో గాలికుంటు వ్యాధి టీకాలను పశువులకు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీలు విశ్వేశ్వరరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, డాక్టర్.లేఖ పాల్గొన్నారు.

సోలార్ డ్రోన్ టెక్నాలజీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : సోలార్ డ్రోన్ టెక్నాలజీలో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ వారు పులివెందులలో సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో స్కిల్ కాలేజీలో శిక్షణ ఇవ్వనున్నారన్నారు. సోలార్ ఇంజనీర్, డ్రోన్ పైలెట్, సర్వీసు టెక్నిషియన్‌లో ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తారన్నారు. సోలార్ ఇంజనీరుకు డిప్లొమా, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, డ్రోన్ పైలెట్ సర్వీసు టెక్నిషియన్‌కు ఇంటర్, ఐటీఐ, డిప్లొమా ఉండాలన్నారు. 90 రోజులపాటు శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయంతోపాటు శిక్షణకు అవసరమైన స్టేషనరి, యూనిఫాం, శిక్షణానంతరం కేంద్ర ప్రభుత్వం జారీ చేసే సర్టిఫికెట్‌ను అందజేస్తామన్నారు. వివరాలకు 99851 42155, 90005 17637, 99492 46094 నంబర్లలో సంప్రదించాలన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

కడప అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి సాగును పెంచాలని ప్రకృతి వ్యవసాయ రాయలసీమ రీజియన్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, నాబార్డు డీడీఎం విజయవిహారిలు సూచించారు. గురువారం కడప జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి విత్తన గుళికలు, పీఎండీఎస్ (ప్రీమాన్ సూన్ డ్రై సోయింగ్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్, విజయవిహారి మాట్లాడుతూ చిరుధాన్యాల పంటల సాగుతో భూమిని 365 రోజులు కప్పివుంచే ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డీపీఎం రామక్రిష్ణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు ఇంటి వద్ద పెరటి తోటల పెంపకం చేపట్టాలన్నారు. అలాగే ప్రతి వారం పొలంబడి నిర్వహిస్తూ రైతులకు పురుగులు, తెగుళ్లపై అవగాహన పెంచుతూ వాటిని అరికట్టడానికి కషాయాలు, ద్రావణాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి, అడిషినల్ డీపీఎం వసంతకుమారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాల్లో వైవీయూ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ : జాతీయస్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాల్లో వైవీయూ విద్యార్థులు సత్తాచాటారు. ఇటీవల బెంగుళూరు నగరంలోని జైన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో విశ్వవిద్యాలయంలోని ఫైన్ ఆర్ట్స్ విభాగం విద్యార్థులు బి.గంపమల్లయ్య శిల్పకళా విభాగంలో (స్వర్ణపతకం), ఫొటోగ్రఫీలో బి. పవన్‌కల్యాణ్ (స్వర్ణపతకం), వై. అరవింద్ కార్టూన్ విభాగంలో (కాంస్యపతకం) సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను, ప్రోత్సహించిన అధ్యాపకులను వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగ జనార్దన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య గురువారం వైవీయూ వీసీ చాంబర్‌లో అభినందించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కల్చరల్ కో-ఆర్డినేటర్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, టీం మేనేజర్‌లు ఆచార్య జి. విజయభారతి, డా. జి. కాత్యాయని పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు జి.లక్ష్మిదేవి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు జి.లక్ష్మిదేవి

రాయచోటి అర్బన్: జిల్లాలో టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు జి.లక్ష్మిదేవి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక జిల్లావిద్యాశాఖాధి కార్యాలయంలో జిల్లాలోని డీవైఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలతో ఆమె 10వ తరగతి పరీక్షలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 123 పరీక్షా కేంద్రాల్లో11,249 మంది బాలురు, 11,146 మంది బాలికలు కలిపి మొత్తం 22,395 మంది హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. ఏ విద్యార్థి కూడా పరీక్షలను కింద కూర్చొని రాయకుండా చూడాలన్నారు. ఎవరైనా మైనర్ అమ్మాయిలకు వివాహాలు జరుపుతున్నట్లు తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి డీవైఈఓ వరలక్ష్మి, సహాయ సంచాలకులు నరసింహులు, కార్యాలయం సూపరిటెండెంట్ వి.పి.రవికుమార్, పరీక్షల విభాగం సీనియర్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన తప్పనిసరి

రామాపురం: విద్యార్థులు బాలల హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని ఏపీ బాలల హక్కుల కమిషన్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఆదర్శ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై నారసింహుడు



కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న శ్రీ లక్ష్మీనరసింహుడు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్పవృక్ష వాహనంపై ఊరేగారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన గురువారం వేకువ జామునే మూలవర్లకు శుద్ధి తోమాల సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి ఊంజల్‌సేవ జరిపారు. వాహన మండపంలో స్వామి వారి వాహనాన్ని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల విధులు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశం



మండల ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: ఎమ్మెల్సీ ఎన్నికల విధుల పట్ల అధికారులు ప్రతిక్షణం అప్రమత్తంగా వ్యవహరిస్తూ పారదర్శకంగా పోలింగ్ ఘట్టాన్ని పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా సింగిల్ విండో సిస్టం ఏర్పాటు, ఎంసీసీ, బందోబస్తు తదితర ప్రక్రియలపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభలు, ర్యాలీలు, వాహనాల అనుమతులకు జిల్లా కేంద్రంలో సింగిల్ విండో సిస్టం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలలో టాయిలెట్, డ్రింకింగ్ వాటర్, ర్యాంపులు, విద్యుత్ కనీస సదుపాయాలు కచ్చితంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఏఎస్పీని ఆదేశించారు. అందులో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, స్ట్రైకింగ్ ఫోర్స్, మొబైల్ పార్టీ, పోలీస్ బందోబస్తు సిద్ధం చేయాలన్నారు. ప్రతి సెక్టార్‌కు మొబైల్ పార్టీ ఫ్లయింగ్ స్క్వాడ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేసి వీడియో రికార్డింగ్ చేయించాలన్నారు. పోలీస్ విధులలో పాల్గొనే వారికి పోస్టల్ బ్యాలెట్ ఫామ్ 12 ఇవ్వాలని సూచించారు. ఎక్కడ మ్యాన్ పవర్ సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ తప్పకుండా చేయించాలన్నారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఏఎస్పీ రాజ్ కమల్, డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లె ఆర్‌డీఓలు రంగస్వామి, మురళీ, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల గుర్తింపును వేగవంతం చేయాలి

జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రభుత్వ భూములను గుర్తించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తహసీల్దార్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో భూసేకరణపై రాయచోటి నియోజకవర్గంలోని తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్‌అన్సారియా, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, రాయచోటి నియోజకవర్గంలోని తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి డీకేటీ, ప్రభుత్వ భూములు గుర్తించి రెండు రోజుల లోపల తమకు రిపోర్టు పంపాలన్నారు. నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లె, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం మండలాలకు సంబంధించి సర్వే నంబర్ల వారీగా గుట్టలు మినహా అందుబాటులో ఉన్న అనువైన భూములు గుర్తించాలన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని అలా జరిగితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై జిల్లా స్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఏఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, రాయచోటి, మదనపల్లె ఆర్డీఓలు రంగస్వామి, మురళి, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లయితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ బాల్యవివాహాల నిర్మూలనకు టోల్‌ఫ్రీ నంబర్ 1098కు ఫోన్ చేసి సహకరించాలన్నారు. ముఖ్యంగా ఎన్జీఓలు బాల్యవివాహాలు అధికంగా జరిగే ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించి వివాహం చేసుకోబోయే అమ్మాయిలకు, అబ్బాయిలకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. బాల్య వివాహాల వల్ల అమ్మాయి, అబ్బాయి జీవితం నాశనం అవుతుందని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఐసీడీఎస్, వైద్యాధికారులు, విద్యా శాఖాధికారులు సమన్వయంతో ప్రతి నెలా క్రమం తప్పకుండా డివిజన్, మండలం, గ్రామ స్థాయిలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ తెలిసీ తెలియని వయసులో బాలికలు వివాహం చేసుకోవడం జీవితంలో ఎదుగుదలకు ఎన్నో రకాలుగా అవరోధాలు కలుగుతాయన్నారు. మైనర్ బాలికను వివాహం చేసుకొనే వ్యక్తిపై పోక్సో చట్టం కింద 10 సంవత్సరాలు జైలు శిక్ష కూడా విధించవచ్చని చెప్పారు.

ఆలయాలకు కొత్త రూపు

- జిల్లాలో 30 ఆలయాలకు మహర్దశ
- గాలి గోపురాలు మొదలుకొని పునర్నిర్మాణాలతో కొత్త కళ
- అన్నమయ్య జిల్లాలో రూపుమారుతున్న 30 ఆలయాలు
- రూ.26.14 కోట్లతో జరుగుతున్న పనులు



తంబళ్లపల్లెలో నిర్మాణంలో ఉన్న మల్లయ్య కొండ ఆలయం

సాక్షి, రాయచోటి : జిల్లాలో పలు ఆలయాల రూపురేఖలు మారుతున్నాయి. పురాతన ఆలయాలతో పాటు ప్రాశస్త్యం కలిగిన దేవాలయాలకు పునరుజ్జీవం కల్పిస్తున్నారు. కొన్ని ఆలయాలకు రాజగోపురాలు నిర్మిస్తుండగా మరికొన్ని ఆలయాలకు సంబంధించిన గోపురాలు అద్భుతంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఒక వైపు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఆలయాల నిర్మాణాలను టీటీడీ చేపట్టగా, మరోవైపు పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అవసరమైన నిధులను అందిస్తూ ఆలయాలకు కొత్త వైభవం తీసుకు వస్తోంది.

జిల్లాలో 30 దేవాలయాలకు పునరుజ్జీవం

అన్నమయ్య జిల్లాలో సుమారు 1711 ఆలయాలు ఉండగా, అందులో 30 ఆలయాలకు సంబంధించిన అభివృద్ధి పనులు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం దేవదాయశాఖ ద్వారా సీజీఎఫ్ నిధులను అందిస్తూ పునర్నిర్మిస్తోంది. రాయచోటిలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన వీరభద్రస్వామి ఆలయానికి సంబంధించిన రాజగోపురంతోపాటు తంబళ్లపల్లె పరిధిలోని మల్లయ్య కొండ ఆలయ రూపురేఖలు కూడా మారుతున్నాయి. అలాగే రెడ్డెమ్మ కొండ ఆలయం, నల్లగంగమ్మ ఆలయ జీర్ణోద్ధరణ పనులతోపాటు జిల్లాలో మొత్తం 30 దేవాలయాల అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జిల్లా దేవదాయశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు గంగయ్య, సహాయక ఇంజినీరు శ్రీనివాసులు, జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథం తదితరులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులను వేగవంతంగా జరిగేలా చూస్తున్నారు.

రూ. 26.14 కోట్లతో అభివృద్ధి పనులు

జిల్లాలో ఆలయాల జీర్ణోద్ధరణకు సంబంధించి సుమారు రూ. 26.14 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందులో కామన్ గుడ్ ఫండ్ కింద రూ. 3.75 లక్షలు ఆలయాల తరపున చెల్లించగా.. మిగిలిన మొత్తాన్ని రూ. 22.39 కోట్లు సీజీఎఫ్ నిధులను అందించారు. మొత్తం మీద రూ. 26.14 కోట్లతో అనేక అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పనులు పూర్తయితే ఆలయాలు అందంగా రూపుదిద్దుకోవడంతో పాటు కొత్త వైభవాన్ని సంతరించుకోనున్నాయి.



జిల్లాలో ఉన్న మొత్తం ఆలయాలు : 1711

ప్రస్తుతం జీర్ణోద్ధరణ కింద పనులు జరుగుతున్న ఆలయాలు: 30

ఆలయాల అభివృద్ధి పనులకు మంజూరైన నిధులు రూ. 26.14 కోట్లు

హత్య కేసులో నిందితుడి అరెస్టు

తంబళ్లపల్లె : మండలంలోని గోపిదిన్నె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన కురమలపల్లె నారాయణరెడ్డి(70) హత్య కేసులో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వివరాలు..బోరువద్ద పంటకు నీరు వదిలే విషయమై బుధవారం నారాయణరెడ్డి, అతని తమ్ముడి కుమారుడు నరేంద్రరెడ్డి ఘర్షణ పడ్డారు. ఈ సమయంలో నరేంద్రరెడ్డి బండరాతితో దాడి చేయడంతో నారాయణరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం కొత్తపల్లె సమీప నల్లగుట్ట వద్ద నిందితుడు నరేంద్రరెడ్డి ఉండగా ములకలచెరువు సీఐ షాదిక్‌అలీ, ఎస్‌ఐ రామకృష్ణారెడ్డిలు అరెస్టు చేశారు.అతన్ని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

కంచె బలి తీసుకుంది


మృతి చెందిన కణితి

సిద్దవటం : అటవీ ప్రాంతం నుంచి గ్రామ శివారులోకి వచ్చిన కణితి మృతి చెందినదని రేంజర్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అడవీ ప్రాంతం నుంచి కణితి సిద్దవటం లోని జగనన్న కాలనీకి సమీపం లోకి వచ్చింది. అక్కడ పొలాలకు సంబంధించిన కంచె దాటే ప్రయత్నంలో కింద పడి పరిగెత్తలేక పోయింది.స్థానికులు తమకు సమాచారం ఇచ్చారు.ఈ లోగా వారు కణితిరు నీరు తాపారు. సంఘటనా స్థలానికి సిబ్బంది వెళ్లిన కొద్దిసేపటికే కణితి మృతి చెందిందని రేంజర్ ప్రసాద్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కణితికు సిద్దవటం పశువైద్య శాలలో పోస్టు మార్టరం నిర్వహించి సాబ్‌బావి బేస్ క్యాంపు అటవీ ప్రాంతంలో ఖననం చేశామని రేంజర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులేస్, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్క దాడి : కార్మికుడికి తీవ్రగాయాలు

మదనపల్లె : కుక్క దాడి చేయడంతో కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. రామారావుకాలనీకి చెందిన రెడ్డెప్ప(50) భవననిర్మాణ కార్మికుడుగా పనిచేస్తున్నాడు. గురువారం రోజువారీ పనులకై ఇంటి నుంచి బయలుదేరి నడిచి వెళుతుండగా, దారిలో రోడ్డుపక్కన ఉన్న ఓ కుక్క అకస్మాత్తుగా అతనిపై దాడి చేసింది. ఈ ఘటనలో బాధితుడు రెడ్డెప్ప తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

తేనెటీగల దాడిలో..

తేనెటీగల దాడిలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు గ్రామానికి చెందిన రెడ్డెమ్మ(42), వెంకటమ్మ(45) గ్రామంలోని ఓ రైతు టమాటా పొలంలో కూలిపనులకు వెళ్లారు. పనులు చేస్తుండగా, అకస్మాత్తుగా తేనెటీగల గుంపు వచ్చి కూలీలపై దాడిచేశాయి. ఈదాడిలో రెడ్డెమ్మ, వెంకటమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.



భర్త కోసం మౌన పోరాటం


భర్త ఇంటి ఎదురుగా దీక్ష చేస్తున్న భాగ్యలక్ష్మి

రాయచోటిటౌన్ : వాళ్లిద్దరిదీ అన్యోన్య దాంపత్యం..వాళ్ల సంసారం రేండేళ్లపాటు సజావుగా సాగింది.తర్వాత మనస్పర్థలు ప్రారంభమయ్యాయి. సర్దిచెప్పాల్సిన అత్తమామలు కూడా పట్టించుకోలేదు. దీంతో ఆ అభాగ్యురాలు మూడేళ్ల నుంచి పుట్టింట్లోనే ఉంటోంది. ఇప్పుడు నా మొగుడు నాక్కావాలంటూ మౌనపోరాటానికి దిగింది. ఆమెకు స్థానిక మహిళలు అండగా నిలిచారు. బాధితరాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామం కస్బాకు చెందిన లక్ష్మీదేవి, శ్రీనివాసులు కుమార్తె అయిన భాగ్యలక్ష్మి(24)ని పక్కనే ఉన్న రమణ (బంకు రమణ) పెద్ద కుమారుడు కె. శరన్‌కుమార్‌కి ఇచ్చి ఐదేళ్ల కిందట వివాహం చేశారు. వీరికి మూడు సంవత్సరాల నిఖిత్ అనే కుమారుడు ఉన్నాడు. వీరి మధ్య మూడు సంవత్సరాల కిందట కలహాలు రేగాయి. దీంతో ఆమె దగ్గర్లోని పుట్టింటికి వె వెళ్లింది. తర్వాత గ్రామానికి చెందిన పెద్ద మనుషులు సర్దిచెప్పేందుకు చాలా ప్రయత్నాలు చేశారు. విఫలం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కూడా మూడు సార్లు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. కాపురానికి తీసుకెళ్లాలని సూచించారు. పెద్ద మనుషులు దగ్గర మాత్రం తనకు గడువు ఇస్తే కాపురానికి తీసుకెళతానని శరన్‌కుమార్ చెప్పేవాడు. భాగ్యలక్ష్మి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడం.. అక్కడ మళ్లీ కౌన్సెలింగ్ ఇవ్వడం.. అక్కడ మళ్లీ శరన్‌కుమార్ గడువు కావాలని కోరడం షరా మామూలుగా మారింది. మధ్యలో తన తమ్ముడికి పెళ్లి చేస్తున్నానని, వివాహం అయిపోగానే తన భార్యను కాపురానికి తీసుకెళతానని శరన్‌కుమార్ చెప్పేవాడు. తర్వాత పట్టించుకోకుండా ఉండేవాడు. దీంతో గ్రామంలోని పెద్ద మనుషులను పంచాయితీ కోసం పంపారు. అయినా ప్రయోజన లేకపోయింది.దీంతో గురువారం ఉదయం భాగ్యలక్ష్మి తన బిడ్డతో కలిసి భర్త ఇంటి ఎదురుగా 'నా భర్త నాకు కావాలంటూ'మౌన పోరాటానికి పూనుకుంది. తన భర్త కాపురానికి తీసుకెళ్లాలని, లేకపోతే ఇక్కడే బిడ్డతో పాటు ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. దీంతో గ్రామంలోని పెద్ద మనుషులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అర్బన్ పోలీసులు రంగ ప్రవేశం చేసి అక్కడ జరిగిన సంఘనపై స్థానికులు, బాధితులతో కలసి విచారణ సాగించారు. ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌కు రావాలని, అక్కడ కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాన్ని నిలబెడతామని, లేకపోతే నిందితుడిపై కేసు నమోదు చేస్తామని చెప్పారు. దీంతో ఇరువర్గాల పెద్దలు పోలీస్ స్టేషన్‌కు చేరారు

రాముల వారికి వెండి ఆభరణాలు సమర్పణ


ఆలయ అధికారులకు వెండి ఆభరణాలను అందజేస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన సీతారామలక్ష్మణ మూర్తులకు గురువారం గుడివాడ స్వర్ణలత అనే మహిళ వెండి ఆభరణాలను సమర్పించినట్లు ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశయ్య తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా, దాన్వాయిపేటకు చెందిన గుడివాడ స్వర్ణలత దాదాపు 4 లక్షల విలువ గల 5 కేజీల 382 గ్రాముల వెండి గొడుగులు, సీతారామలక్ష్మణ, హనుమంత స్వాముల ముద్ర కల్గిన వెండి పథాకాన్ని సమర్పించారు. ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అధికారులకు అందజేశారు.

చీటింగ్ కేసులో రెండేళ్ల జైలు

కడప అర్బన్ : కడపలోని శంకరాపురానికి చెందిన దోగా యుగంధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు శంకరాపురానికి చెందిన కోలా మల్లికార్జునపై క్రైమ్ నంబర్. 350/2019 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. 2006లో నిందితుడు కోలా మల్లికార్జున కడపలోని ఏడురోడ్ల వద్ద ఉన్న ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో ఓడీగా చిన్నచౌక్ పరిధిలోని రాజాజీనగర్‌లో ఉన్న 19 సెంట్ల స్థలాన్ని బ్యాంకు వారికి తనఖా పెట్టి రూ. 10లక్షలు డబ్బులు తీసుకున్నాడు. తర్వాత నిందితుడు సదరు ఓడి విషయమై బ్యాంకు వారికిగానీ, ఫిర్యాదితో కానీ తెలుపకుండా నకిలీ డాక్యుమెంట్లను తయారు చేశాడు. అతని స్నేహితుల వద్ద నుంచి సుమారు రూ. 50 లక్షలు డబ్బులను తీసుకుని ఫిర్యాదికి, అతని స్నేహితులకు నకిలీ డాక్యుమెంట్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించి మోసం చేశారు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నచౌక్ ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గురువారం కడప రెండో అదనపు మెజిస్ట్రేట్ షేక్ రియాజ్ బాషా కేసును విచారించి నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2100 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా ఇందుకూరు గంగరాజును పోలీసులు పట్టుకున్నారు. అతని వద్దన ఉంచి పది బస్తాలను (600 కిలోల బియ్యం) స్వాధీనం చేసుకున్నట్లు ఎర్రగుంట్ల పోలీసులు తెలిపారు. వేంపల్లె మండలం పరిధిలోని ముతుకూరు గ్రామానికి చెందిన ఇందుకూరు గంగరాజు ఎర్రగుంట్ల ప్రజలకు మాయ మాటలు చెప్పి రేషన్ బియ్యం తీసుకుని ప్రొద్దుటూరులోని ఓ వ్యక్తికి అమ్మడానికి వెళుతుండగా వినాయకనగర్ కాలనీ సమీపంలో పట్టుకున్నామన్నారు.

సారా విక్రేత అరెస్ట్

మదనపల్లె : సారా విక్రేతను అరెస్ట్‌చేసి అతడి వద్ద నుంచి 5లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని బసినికొండకు చెందిన లవకుమార్‌నాయక్ గురువారం ఇంటివద్ద సారా విక్రయిస్తుండగా, దాడిచేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి అరెస్ట్‌చేశామన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబసమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లె మండలంలో బుధవారం జరిగింది. పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన రత్నమ్మ(50) కూలిపనులు చేస్తూ జీవిస్తోంది. ఈక్రమంలో గురువారం కుటుంబసమస్యలతో మనస్తాపం చెంది పురుగులమందు తాగింది. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైకులు ఢీ

నందలూరు(రాజంపేట) : నందలూరు-టంగుటూరు రహదారిలోని ఆడపూరు వద్ద గురువారం రెండు బైకులు ఢీ కొన్నాయి. పొత్తపి నుంచి నందలూరుకు వస్తున్న మహేష్‌యాదవ్, నందలూరు నుంచి వెళుతున్న జంగంశెట్టి సుబ్బరాయుడు బైకులు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో మహేష్‌యాదవ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇతన్ని 108 వాహనంలో రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఏఎస్‌ఐ సుబ్బరాయుడు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

9 మంది జూదరుల అరెస్ట్

నిమ్మనపల్లె : జూదం ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసి కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ ఫాతిమా తెలిపారు. మండలపరిధిలోని ముష్టూరు పంచాయతీ దిగువపల్లె సమీపంలో బుధవారం సాయంత్రం జూదం ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,770 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఊపందుకున్న రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల ప్రచారం


ప్రచారం చేస్తున్న సౌత్‌సెంట్రల్ మజ్దూర్ యూనియన్ బ్రాంచి సెక్రటరీ విశ్వనాథ్ తదితరులు

రాజంపేట : జిల్లాలోని నందలూరు రైల్వేకేంద్రం పరిధిలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల ప్రచారం గురువారం ఊపందుకుంది. సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్, సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్యానెల్ అభ్యర్థులు కార్మికులను కలిసి మద్దతు కోరుతున్నారు. తమకు కేటాయించిన గుర్తులను చూపించి, ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. మజ్దూర్ యూనియన్ తరపున బ్రాంచి సెక్రటరీ, రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ అభ్యర్థి విశ్వనాథ్, ఎంప్లాయిస్ సంఘ్ తరపున సెక్రటరీ అభ్యర్థి కృష్ణమూర్తి తమ ప్యానెల్ అభ్యర్థులతో ప్రచారం చేపట్టారు.

- కడప రైల్వేస్టేషన్ సరిహద్దు స్టేషన్ కనుమలోపల్లె నుంచి పుల్లంపేట వరకు సౌత్‌సెంట్రల్ మజ్దూర్ యూనియన్ నందలూరు బ్రాంచి నేతలు ప్రచారం చేశారు. విధి నిర్వహణలో ఉన్న కార్మికులు, ఉద్యోగులను నేరుగా కలిసి బ్యాలెట్ నమూనా పత్రాలను అందచేస్తున్నారు. కార్యక్రమంలో ప్యానెల్ జాయింట్‌సెక్రటరీ, ట్రెజరర్, డైరక్టర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.25 కోట్లు మంజూరు


శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అధికారులు

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె పంచాయతీలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పునర్నిర్మించనున్నారు. ఇందులో భాగంగా పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ సురేష్ గురువారం ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పునః నిర్మాణం కోసం రూ.1.25 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. దేవదాయ శాఖాధికారుల అనుమతులు కోరడంతో పురావస్తు శాఖ కమిషనర్ వాణిమోహన్ ఆదేశాల మేరకు ఆలయాన్ని పరిశీలించేందుకు వచ్చామన్నారు. ఈ ఆలయం 16, 17వ శతాబ్దంలో నిర్మించినట్లు ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోందన్నారు. నాటి శాసనాలను జాగ్రతగా తొలగించి భద్రంగా ఉంచాలని అధికారులకు ఆయన సూచించారు. ఆలయ పరిశీలన నివేదిక పురావస్తు శాఖాధికారులకు అందిస్తామని, వారి ఆదేశాల ప్రకారం ఆలయ పునః నిర్మాణ పనులు త్వరలో చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏడీ భాస్కర్‌నాయక్, డీఈ రంగయ్య, టీఏ రాఘవేంద్ర, ఏడీ శివకుమార్, ఏఈ కొండారెడ్డి, ఎంపీఎస్ తిమ్మారెడ్డి, ఆలయ అర్చకులు గణేష్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 3000 కొత్త ఆలయాల నిర్మాణం


జ్వాలాపురం శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రాష్ట్రంలో కొత్తగా 3000 ఆలయాలు నిర్మాణ దశలో ఉన్నాయని రాష్ట్ర దేవదాయ శాఖ ప్రభుత్వ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్ తెలిపారు.గురువారం పట్టణంలోని ముజంగేశర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒక్కో ఆలయానికి రూ. 10లక్షలు ఖర్చు పెట్టి 3వేల దేవాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఇప్పటికే 936 ఆలయాల నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. అర్చకుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రీసర్వే జరిపి దేవాలయాల భూములు కాపాడుతామన్నారు. కార్యక్రమంలో అధికారి సుదీష్‌రెడ్డి, త్రివిక్రమ్, బ్రాహ్మణ నాయకులు ఓరుగంటి అనీల్‌కుమార్, కోసంగిశ్రీకాంత్, దూర్జటియోగి, వెన్నెలకంటి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.30లక్షల నగదు పట్టివేత


స్వాధీనం చేసుకున్న నగదు, కారుతో సీఐ

రాజంపేట : రాజంపేట-నెల్లూరు రహదారిలోని పొలిచెరువుకట్టపై ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేస్తుండగా గురువారం చెన్నైకి చెందిన వారి కారులో రూ.30లక్షలు నగదు పట్టుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ నరసింహారావు విలేకర్లతో మాట్లాడుతూ టీఎన్05సీసీ7799 నంబరు గల వాహనంలో చెన్నైకి చెందిన వెంకటరమణ, మరో ముగ్గురు కలిసి రాజంపేటకు చెందిన వ్యక్తి వద్ద స్థలం కొనడానికి రూ.30లక్షల నగదును తీసుకువస్తున్నట్లు తెలిపారన్నారు. సరైన పత్రాలు లేనందున పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. నగదను ఫ్లయింగ్‌స్క్వాడ్‌కు అప్పగించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నరసింహులు, స్పెషల్‌ఫోర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ


బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఆర్టీసీ అధికారులు

పీలేరు : ప్రయాణికుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితునికి అందించి కండక్టర్ తన నిజాయితీ చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. సంబేపల్లె మండలం మోటకట్లకు చెందిన పూజల కాటంరాజు ఈ నెల 1న సంబేపల్లె నుంచి తిరుపతికి వెళుతూ ఆర్టీసీ బస్సులో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. విధి నిర్వహణలో ఉన్న పీలేరు డిపో కండక్టర్ వెంకటరమణకు సెల్‌ఫోన్‌ను గుర్తించి ఆర్టీసీ అధికారులకు అందించాడు. సెల్‌ఫోన్ యజమానిని గుర్తించి గురువారం బాధితుడికి సెల్‌ఫోన్ అందించాడు. సుమారు రూ. 15 వేలు విలువైన సెల్‌ఫోన్ తిరిగి ఇవ్వడంతో కండక్టర్‌కు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బైక్, ఆటో ఢీ : కార్మికుడికి గాయాలు

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో ఓ చేనేత కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన శంకర(40) చేనేత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం వ్యక్తిగతపనులపై ద్విచక్రవాహనంలో పట్టణంలోకి వస్తుండగా, కదిరిరోడ్డులో వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో బాధితుడు శంకర తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు


పార్టీకార్యాలయంలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు: రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్ర భు త్వం కృషి చేస్తోందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క నిరోద్యోగికి ఉపాధి కల్పనే లక్ష్యంగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన కార్పొరేట్ దిగ్గజాలు విశాఖకు చేరుకున్నట్లు చెప్పారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు హంగులు, ఆర్భాటాలు మాత్రమే చేశారని, అలాకాకుండా వాస్తవ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. దేశంలో 11 పారిశ్రామిక కారిడార్‌లు వస్తుంటే అందులో మన రాష్ట్రానికి 3 రావడం గొప్ప విషయం అన్నారు. అలాగే రాష్ట్రంలో 6 పోర్టులు ఉండగా అదనంగా 4 ఏర్పాటవుతున్నాయన్నారు. భవిష్యత్‌లో గ్రీన్ ఎనర్జీలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

లోకేష్ పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్..

నారా లోకేష్ యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్ర పూర్తిగా ఫెయిలైందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ యాత్రలో వ్యక్తిగత సిబ్బంది మినహా కనీసం కార్యకర్తలు కూడా కనిపించడంలేదన్నారు. జనాలు లేక వెలవెలబోతోందన్నారు. జాకీ పెట్టి లేపినా లేవలేని పరిస్థితిలో టీడీపీ ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, పట్టణ అధ్యక్షుడు సిహెచ్.రమేష్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ.నాగేంద్ర, బిసి సెల్ మానిటరింగ్ సభ్యుడు సుబ్రమణ్యం, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, మల్లు క్రిష్టారెడ్డి, హరిక్రిష్టారెడ్డి, మహేష్, ప్రతాప్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో రైలు ఢీకొని ప్రవాసాంధ్రుడు మృతి


శ్రీకాంత్‌రాజు (ఫైల్)

పీలేరు రూరల్ : అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన ఒకరు అమెరికాలో దుర్మరణం పాలయ్యారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పీలేరు పట్టణం కోడి అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న విశ్రాంత ఆర్మీ ఉద్యోగి విజయకుమార్‌రాజు, సరళ దంపతుల కుమారుడు శ్రీకాంత్‌రాజు (40) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఆరేళ్ల నుంచి న్యూజెర్సీలో పని చేస్తున్నారు. ప్రతి రోజూ తన ఇంటి నుంచి కార్యాలయానికి వెళ్లేందుకు లోకల్ ట్రైన్‌లో ప్రయాణించేవాడు. ఈ నేపథ్యంలో ఆమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం రైల్వే స్టేషన్‌లో రైలు ఢీకొనడంతో శ్రీకాంత్‌రాజు మృతి చెందినట్లు స్నేహితులు సమాచారం అందించారు. శ్రీకాంత్‌రాజు మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు. ఆగస్టులో స్వదేశానికి వస్తానన్న శ్రీకాంత్‌రాజు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

చీటింగ్ కేసు నమోదు

మదనపల్లె : ఫైనాన్స్‌లో మోటార్‌సైకిల్ తీసుకుని నెలసరి కంతులు చెల్లించకుండా వాహనాన్ని దాచేసిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదుచేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన హరీష్(23) నీరుగట్టువారిపల్లె టమాటా మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. పట్టణంలోని ఓ ఫైనాన్స్ సంస్థలో రూ.83,000కు ద్విచక్రవాహనాన్ని వాయిదాల పద్ధతిపై కొనుగోలు చేశాడు. నాలుగు నెలసరి కంతులు చెల్లించాడు. తర్వాత కంతులు చెల్లించకపోగా, తన నివాసాన్ని మార్చివేశాడు. ఈక్రమంలో ఫైనాన్స్ ఇచ్చిన వీరారెడ్డి హరీష్ వాయిదాలు చెల్లించకుండా మోసం చేయడంతో పాటు వాహనాన్ని దాచేశాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో టూటౌన్ ఎస్‌ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

